ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సంజీవిని

- గ్రామీణ మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణే లక్ష్యం
- శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు
- అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహకారం



సంజీవిని ఉచిత వైద్యశిబిరాలు.

కేవీపల్లె : గ్రామీణ ప్రాంత మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణతో పాటు వారి ఆరోగ్యాన్ని పరిక్షించడానికి తీసుకొచ్చిన 'సంజీవిని మహిళా ఆరోగ్య కార్యక్రమం' సత్ఫలితాలిస్తోంది. మండలంలోని తిమ్మాపురంకు చెందిన శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.రవీంద్రనాథ్‌రెడ్డి 'సంజీవిని మహిళా ఆరోగ్య కార్యక్రమం' తీసుకొచ్చారు. ఈ కార్యక్రమాలు నిర్వహించడానికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ అధినేత నిత్యారెడ్డి ఆర్థిక సహకారం అందించడానికి ముందుకొచ్చారు. పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి మహిళలకు గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు పాప్‌స్మియర్ పరీక్షలు, శస్త్ర చికిత్సకు ఎంపిక, ప్రజలకు సాధారణ జబ్బులకు వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీ చేసే విధంగా కార్యక్రమం రూపొందించారు. తిరుపతి మెడిగో హాస్పిటల్స్ వైద్యులు, నర్సింగ్ నిపుణులు మహిళలకు గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు గర్భాశయ స్క్రీనింగ్ టెస్టులు చేయడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

13 వైద్య శిబిరాలు

నియోజకవర్గంలోని కేవీపల్లెలో జూన్ 30న సంజీవిని మహిళా ఆరోగ్య కార్యక్రమం ప్రారంభించారు. ఉచిత వైద్యశిబిరాలకు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 13 వైద్యశిబిరాలు నిర్వహించి 1932 మంది మహిళలకు ఆరోగ్యసేవలందించారు. 578 మంది మహిళలకు పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణ చేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఫాలోఅప్ చికిత్స అందించడం జరుగుతోందని తెలిపారు. ప్రతి ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసే ఈ కార్యక్రమం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నిర్వహిస్తామని చెప్పారు.

గ్రామీణ మహిళల జీవితాల్లో వెలుగు



గ్రామీణ మహిళలకు గర్భాశయ క్యాన్సర్ సంబంధిత సమస్యలను నివారించి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా సంజీవిని మహిళా ఆరోగ్య కార్యక్రమం తీసుకొచ్చాం. పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అన్ని గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తాం. మరిన్ని ప్రాంతాలకు ఈ కార్యక్రమం విస్తరిస్తాం. – డాక్టర్ ఎస్. రవీంద్రనాథ్‌రెడ్డి, శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు

అద్భుత ఫలితాలు



సంజీవిని మహిళా ఆరోగ్య కార్యక్రమం అద్భుతమైన ఫలితాలిస్తోంది. వైద్య నిపుణుల మార్గదర్శకత్వంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం. అవసరమైన చికిత్స అందించడంతోపాటు ఉచిత మందులు ఇస్తున్నాం. మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – డాక్టర్ పి.వి. బ్రాహ్మారెడ్డి, ట్రస్టీ

మహిళా ఆరోగ్యానికి ప్రాధాన్యత



సంజీవిని కార్యక్రమం ద్వారా ఊరూరా మహిళల్లో మెరుగైన ఆరోగ్య సంరక్షణ అంశాన్ని ప్రచారం చేయడం ద్వారా మంచి ఆరోగ్య సంప్రదాయాన్ని పాటిస్తున్నాం. మహిళా ఆరోగ్య సాధికారి సాధించడానికి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోంది. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబమంతా సంతోషంగా ఉంటుంది. – శశికుమార్‌రెడ్డి, కార్యక్రమ సమన్వయకర్త.

ఉచితంగా శస్త్రచికిత్స అందించారు



సంజీవిని వైద్యశిబిరంలో నాకు వైద్య పరీక్షలు నిర్వహించి గర్భాశయ రక్తస్రావాన్ని, ఫైబ్రాయిడ్‌ను గమనించారు. వైద్యుల సూచన మేరకు శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ వారు సుమారు రూ.లక్ష విలువైన అత్యవసర హిస్టెరెక్టమీ శస్త్ర చికిత్స ఉచితంగా చేపించారు. ట్రస్ట్‌కు కృతజ్ఞతలు. – కె. గీతాంజలి, కేవీపల్లె.

క్లుప్తంగా

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి


గాంధీ కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

కలికిరి : విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు సిబ్బంది సేవలు మరువలేనివని సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శ్రీనివాసా, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలికిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ మీదుగా గాంధీ కూడలి వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌సీలు కొండప్ప, మనోహర్, పీసీలు, హోంగార్డులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కలికిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భానుమూర్తి తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరవ్వాలని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరవ్వాలని ఎంపీడీఓ కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రామసముద్రం : పేకాటస్థావరంపై దాడిచేసి ఎనిమిది మందిని అరెస్ట్‌చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని ఆర్.నడింపల్లె పంచాయతీ ఆర్.కమతంపల్లె గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య పోలీస్‌సిబ్బందితో కలిసి దాడిచేశారు. దాడుల్లో ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.8,450లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవన్నారు.

అంకాలమ్మ ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పీలేరు : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన రౌద్రాల అంకాలమ్మ ఆలయం హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.98,500 ఆదాయం వచ్చినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ తెలిపారు. సోమవారం ఆలయంలో హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో ఈవో రవీందర్‌రాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూమిపూజ


అంకాలమ్మగుడి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : పీలేరు – కలికిరి జాతీయ రహదారి మార్గం మధ్యలో శివపురం (అంకాలమ్మ గుడి) వద్ద ఉన్న అంకాలమ్మ ఆలయంను నాలుగు రోడ్ల విస్తరణలో భాగంగా తొలగించడం జరిగింది. దీంతో అమ్మవారి ఆలయం పునర్నిర్మాణం కోసం సోమవారం భూమి పూజ నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఊటుపల్లె సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్‌లు

కలికిరి : మండలంలో మంగళవారం నుంచి ఆధార్ క్యాంప్‌లు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ భానుమూర్తి తెలిపారు. 22న కలికిరి-3, అద్దవారిపల్లి గ్రామ సచివాలయాలు, 23న బుధవారం కలికిరి-3, గుండ్లూరు గ్రామ సచివాలయాలు, 24న కలికిరి-3 సచివాలయం, మహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు) నందు, 25న కలికిరి-3, మహల్ గ్రామ సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ క్యాంపులు జరుగుతాయని, 5సం.లోపు పిల్లలకు బాల ఆధార్ ఉచితమన్నారు. ఏడు సంవత్సరాల వరకు, 15 నుంచి 17 సం.లు వయస్సు కలిగిన వారికి బయోమెట్రిక్ ఉచితంగా అప్‌డేట్ చేయడం, మిగిలిన వారికి బయోమెట్రిక్ అప్‌డేట్‌కు ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.100, పేరు, వయస్సు, మొబైల్ నెంబరు, అడ్రస్ మార్పు తదితరాలకు రూ.50 వసూలు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తహసీల్దార్ కార్యాలయం నుంచి రికార్డుల తరలింపు

తంబళ్లపల్లె : స్థానిక తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుని వర్షాలకు కురిసి రెవెన్యూ ఉద్యోగులకు విధి నిర్వహణలో ఆటంకం ఏర్పడింది. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయం నుంచి రికార్డులు సోమవారం ద్వారకనగర్‌లోని జిల్లా పరిషత్ గెస్టు హౌస్‌కు తరలించినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఇకపై జిల్లా పరిషత్ గెస్టు హౌస్‌లోనే రెవెన్యూశాఖ కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ

కేవీపల్లె : ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ అధికారి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో పీహెచ్‌సీ సాధించిన ప్రగతిని సమీక్షించారు. వ్యాక్సీన్లు నిల్వ ఉంచిన తీరును, రోగుల వార్డును, కాన్పుల గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో వీలైనంత త్వరగా గర్భవతులను గుర్తించి, హైరిస్క్ గర్భితుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు. ప్రతి నెలా 9వ తేదీ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. గర్భవతులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ, సీనియర్ అసిస్టెంట్ గిరిధర్‌రెడ్డి, సూపర్‌వైజర్ పురుషోత్తం, సిబ్బంది రమణ, కవిత, స్వర్ణలత, భానుప్రియ, గిరిబాబు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో అనారోగ్య సమస్యలు


అయోడిన్ లోప నివారణ దినోత్సవం నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీవిద్య


వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి పరిధిలోని ఆరమడకలో డాక్టర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోడిన్ అనే సూక్ష్మ మూలకం లోపం వల్ల, తగినంత మోతాదులో అయోడిన్ తీసుకోకపోవడం వలన మన శరీరంలో కొన్ని జీవక్రియలు మందకూడిగా జరగడం వలన కొన్ని అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. మహిళల్లో ఋతుస్రావ సమస్యలు, గర్భధారణ సమస్యలు, చెవిటితనం, మూగ పిల్లలు జన్మించడం, మరుగుజ్జులుగా ఎదగడం, వెంట్రుకలు రాలిపోవడం, నిద్రలేమి, స్థూలకాయం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పి రమ్య, ఎఎన్ఎం ధనలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుదాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కర్ణాటక రాష్ట్రం కునేగల్ నుంచి దాదాపు రెండు వేల మందికిపైగా తిరుమలకు పాదయాత్ర చేపట్టి సోమవారం వాల్మీకిపురం మండలానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాదయాత్ర భక్తులకు కళ్యాణ మండపం, వసతి, భోజన సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం నుంచి దాదాపు 350 కిలోమీటర్లకు పైగా దూరం ఉన్న తిరుమలకు పాదయాత్రగా వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉంటేనే ఎవరైనా ఆయన్ను దర్శించుకోవచ్చునన్నారు. బస్సు, రైలు తదితర వాటిలో వెళ్లడం కన్నా పాదయాత్రగా వెళ్లడం ఎంతో పుణ్యమన్నారు. అనంతరం పాదయాత్ర కోఆర్డినేటర్లు బలరాం, రమేష్‌లు మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా ప్రతి ఏడాది పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, క్రిష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న గ్రామజ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర

మదనపల్లె సిటీ : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని బీటీ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్ వై.ఎస్.మునిరత్నం తెలిపారు. సోమవారం స్థానిక కదిరిరోడ్డులోని మదనపల్లె జూనియర్ కాలేజీలో సే నో టు డ్రగ్స్ కార్యక్రమం మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటుపడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. వీటిని ఉపయోగించడం వల్ల త్వరగా ఆరోగ్యం పాడవడంతో పాటు చెడు అలవాట్లుకు బానిసలవుతారన్నారు. వీటి గురించి కాలేజీల్లో అధ్యాపకులు విద్యార్థులకు తెలియజేయాలన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా సమాజాన్ని కాపాడటం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు, కాలేజీ కరస్పాండెంట్ మహేశ్వర్‌రెడ్డి, ఏఓ గోపినాథ్, గ్రామజ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార భీమేశ్వర్‌రావు

పీలేరు : భూ సమస్యలపై రైతులు ఇచ్చిన అర్జీలు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు అన్నారు. సోమవారం రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో ఆవులవారిపల్లె, మద్దెలచెరువుపాళెం, కాలిపల్లె, జాండ్ల, అగ్రహారం గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి అయినట్లు తెలిపారు. ఈ గ్రామాలకు సంబంధించి ఈ నెల 23న గ్రామ సభలు ఉంటాయన్నారు. భూముల రీసర్వేలో ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు ఉంటే రైతులు గ్రామసభలో అర్జీలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ రెడ్డెప్పరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్


మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలిస్తున్న జడ్జి ఎ. మహేష్

పీలేరు రూరల్ : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ మెయిన్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది షౌకత్‌అలి, ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సురేంద్రనాథరెడ్డి, నటరాజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : నిబంధనలు అతిక్రమించి టపాసులు విక్రయించినా.. నిల్వ ఉంచినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, లైసెన్స్ రద్దుచేసేందుకు వెనుకాడేది లేదని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో టపాసుల దుకాణాల నిర్వహణపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, షాప్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. దుకాణాల ఏర్పాటులో భద్రతకే అధిక ప్రాధాన్యతని, చిన్న ప్రమాదం కూడా జరగకుండా ప్రజలందరూ ఆనందంగా దీపావళి జరుపుకోవాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. టపాసుల దుకాణదారులు నియమ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలు ఏర్పాటుచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణానికి మూడు మీటర్లు దూరం ఉండాలన్నారు. ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోవాలని, ప్రతి దుకాణం వద్ద నీరు, ఇసుకనింపిన బకెట్లు ఉంచాలన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ అధికారుల సూచనల మేరకు తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు పొందాలన్నారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, విద్యుత్, మున్సిపాలిటీ తదితర అధికారులు సమన్వయంతో పనిచేసి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఎస్పీ కొండయ్య, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్‌లు ఖాజాబీ, నిర్మల, ధనంజయ, ఫైర్‌ఆఫీసర్ శివయ్య, ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ సీఐలు చాంద్‌బాషా, రాజారమేష్, ఎస్‌ఐలు హరిహరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారును సద్వినియోగం చేసుకోవాలి


పోతబోలు గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు

మదనపల్లె : పట్టణంలోని సంతగేటు సమీపంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో తిరిగి ప్రారంభిస్తున్న రైతుబజార్‌ను మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెటింగ్‌శాఖ ఏడీ త్యాగరాజు కోరారు. సోమవారం మండలంలోని పోతబోలు పంచాయతీ ఉప్పరపల్లి, భూమకవారిపల్లె, పోతబోలు గ్రామాల్లో పర్యటించి, రైతులను కలుసుకున్నారు. రైతుబజార్‌కు వ్యవసాయ ఉత్పత్తులను తరలించి, గిట్టుబాటు ధర పొందాలన్నారు. రైతుబజార్‌లో రైతులు తమ పంట ఉత్పత్తులను మధ్యవర్తులు, దళారులు, కమీషన్ల బెడద లేకుండా విక్రయించుకోవచ్చన్నారు. రైతుబజార్‌లో రైతులు విక్రయించే ఉత్పత్తులకు ఎలాంటి గేటు చెల్లించక్కర్లేదన్నారు. రైతులు ఏ సమయంలో రైతుబజార్‌కు వచ్చినా వారికి కావాల్సిన అన్ని వసతులు సమకూర్చడం జరిగిందన్నారు. రైతుబజార్‌లో ఉత్పత్తులు విక్రయించుకునేందుకు రైతులు తమ సమీపంలోని రైతు సేవాకేంద్రానికి లేదా మదనపల్లె రైతుబజార్ కార్యాలయం వద్దకు వెళ్లి ఆధార్, పాస్‌పుస్తకం, ఫొటోలు, దరఖాస్తు సమర్పిస్తే వారు ఐడెంటిటీ కార్డులు మంజూరుచేస్తారన్నారు. ప్రకృతివనం ప్రసాద్, పుంగనూరు దేశీఆవుల రైతు కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు


వినికిడి సమస్యలున్న పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మదనపల్లె : చిన్నారుల్లో వినికిడి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సరైన చికిత్సను అందించాలని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.ఎస్.రాజు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నేషనల్ దీనదయాళ్ శ్రవణ్ ఫౌండేషన్, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వినికిడి యంత్రాలు పొందేందుకు అర్హుల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ వినికిడి లోపం సమస్య ఉంటే కాక్లియర్ ఇంప్లాంట్‌తో పిల్లలను సాధారణంగా మార్చవచ్చని పేర్కొన్నారు. ఫౌండేషన్ అధికారి రవితేజ మాట్లాడుతూ గ్రామస్థాయిలోని పీహెచ్‌సీల ద్వారా వినికిడి సమస్యలు, లోపాలు ఉన్న పిల్లల వివరాలను సేకరించామన్నారు. నమోదుచేసుకున్న వారికి డిసెంబర్‌లో ఉచితంగా వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జమున, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రమేష్‌బాబు, ఆర్‌బీఎస్‌కే జిల్లా అధికారి శివప్రతాప్, డైక్ పీడియాట్రిస్ట్ సురేష్‌రెడ్డి, నవీన్‌కుమార్, ఆడియాలజిస్ట్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

కలకడ : మండలంలో నిర్వహించనున్న రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పనికుమార్ కోరారు. సోమవారం ఆయన గ్రామ సభల వివరాలను తెలియజేశారు. సోమవారం అంగన్‌వాడి కేంద్రం- పోతువారిపల్లె, మంగళవారం రైతుభరోసా కేంద్రం-నడిమిచెర్ల, బుధవారం ప్రభుత్వ ప్రాథమికపాఠశాల-కలకడ కొత్తపల్లె, గురువారం పంచాయతీ కార్యాలయం-రాతిగుంటపల్లె, శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల-దేవులపల్లె గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలో రీసర్వే చేసిన 1831.31ఎకరాల భూమికి సంబంధించిన 1783 సర్వే నెంబర్లు, 666 రైతు ఖాతాల వివరాలను సభల్లో తెలియజేస్తారన్నారు. ఎలాంటి రెవెన్యూ సమస్యలు ఉన్నా గ్రామసభలలో తెలియజేయవచ్చునన్నారు. అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకువాలని కోరారు.

యోగభోగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

మదనపల్లె సిటీ : స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు విశేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

రూ.27లక్షలతో సెక్షన్ ఆఫీస్ మంజూరు

రామసముద్రం : రామసముద్రం మండలం విద్యుత్ కార్యాలయంలో రూ.27లక్షలతో సెక్షన్ ఆఫీస్ మంజూరైనట్లు ట్రాన్స్‌కో ఏడీ హరికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యుత్ కార్యాలయంలో పాతభవనం ఉరుస్తుండటంతో నూతన భవనం మంజూరైనట్లు చెప్పారు. త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణపనులు చేపడుతామన్నారు. అలాగే కొత్త వ్యవసాయ సర్వీస్‌కు దరఖాస్తు చేసుకున్న వినియోగదారులకు సీనియారిటీ ప్రకారం త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు అందజేస్తారన్నారు.

ఆరుకోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు


రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె : నియోజకవర్గంలో రూ.6 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం మదనపల్లె మండలంలోని పంచాయతీల్లో 68 సీసీ రోడ్ల నిర్మాణాలకు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ధ్యేయంగా కూటమిప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. గ్రామాల్లో మౌలికవసతులు కల్పించి, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేయడమే ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెమ్మ, సర్పంచ్‌లు ఆనందపార్థసారధి, వెలుగుచంద్ర, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జుట్ల దేవర్లు

తంబళ్లపల్లె : మండలంలోని మర్రిమాకులపల్లెలో మద్దెమ్మతల్లి ఆలయంలో ఆదివారం రాత్రి తూగువారి దాయాదులు చిన్నపిల్లలకు తలనీలాల సమర్పణ (జుట్ల దేవర్లు) ఘనంగా నిర్వహించారు. మెరుసుకాపు రెడ్లలోని తూగువారి దాయాదులు పుట్టిన పిల్లలకు తలనీలాలు సమర్పించడం (జుట్లు దేవర) మహిళలకు కొద్దెర బోట్లు నిర్వహించడం పూర్వీకుల నుంచి సంప్రదాయబద్ధంగా వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కులదైవం మద్దెమ్మతల్లి ,వీరభద్రస్వామిలకు, దేవర పెద్ద వీరభద్రారెడ్డి ,కుల పెద్దలు చంద్రశేఖర్‌రెడ్డి ,శివారెడ్డి,రుక్మాంగదరెడ్డి,చిన్నరెడ్డిల ఆధ్వర్యంలో ఈ జుట్లు దేవర కార్యక్రమం కనువిందుగా నిర్వహించారు. సుమారు 13 కుటుంబాల నుంచి 13 జంటలు తమ పిల్లలకు తలనీలాలు సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం


శివాలయం ఎదుట కోలాటల దృశ్యం

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య, ఆకుల మల్లికార్జున ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన వైఎస్సార్ కడప జిల్లా కోలాటలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రహ్మంగారి మఠంకు చెందిన విరజానంద సభ్యులచే భక్తి పాటలతో చేసిన కోలాటలు చూపరులకు ఆశక్తి కలిగించాయి. అంతకు మునుపు కోలాట సభ్యులందరూ ఆలయంలోని స్వామి వారిని భక్తి శ్రద్దలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

పీలేరురూరల్ : భారతీయ కలలు, సంప్రదాయాలపై వక్తృత్వ, వ్యాసరచన, సంప్రదాయ నృత్యాలు పోటీల్లో పీలేరు జెడ్పీ మెయిన్ పాఠశాల విద్యార్థులు 18 మందికి ప్రశంసాపత్రాలు లభించాయి. తిరుపతి మహతీ ఆడిటోరియంలో వే ఫౌండేషన్ డాక్టర్ పైడిపల్లె వెంకయ్య ఆధ్వర్యంలో భారతీయ కళా ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ కలలు, సంప్రదాయాలపై వక్తృత్వ, వ్యాసరచన, సంప్రదాయ నృత్యాలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు లభించాయి.

23 నుంచి రీ-సర్వే గ్రామ సభలు

నిమ్మనపల్లె : ఈనెల 23 నుంచి మండలంలో రీ-సర్వే గ్రామ సభలు నిర్వహిస్తామని తహసీల్దార్ ధనుంజయులు తెలిపారు. మండలంలో ఇదివరకే రీ సర్వే ప్రక్రియ పూర్తయిన తవళం, టీ చౌకిలవారిపల్లె, నిమ్మనపల్లె, అగ్రహారం గ్రామాలలో గ్రామ సభలు జరుగుతాయన్నారు. 23న తవళం గ్రామ సచివాలయం, 24న టీ చౌకిల్లవారిపల్లె రచ్చబండ, 25న నిమ్మనపల్లె -1 గ్రామ సచివాలయం, 26న నిమ్మనపల్లె -2 సచివాలయం, 29, 30 తేదీలలో అగ్రహారం శివాలయం వద్ద గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. గ్రామ సభలలో రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలను దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోపు పరిష్కరిస్తామన్నారు. రైతులు గ్రామసభలకు హాజరై పట్టాదారు పేరు, లేక తండ్రి పేరు, భూమి విస్తీర్ణంలో వ్యత్యాసం, జాయింట్ ఎల్‌పీఎంల విభజన, మ్యుటేషన్‌లోని పొరపాట్లు, సర్వేనెంబర్, సబ్‌డివిజన్‌లలోని వ్యత్యాసాలు, జాయింట్ మ్యూటేషన్ విభజన, తదితర సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు.

టాయిలెట్ లిక్విడ్ పంపిణీ

రామసముద్రం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు, ప్రభుత్వ కళాశాలలకు సోమవారం టాయిలెట్ లిక్విడ్‌ను ఎంఈఓ-1, 2లు హేమలత, ఆంజనేయులు పంపిణీ చేశారు. మండలంలో 81 ప్రభుత్వ పాఠశాలలకు 1,772 లీటర్ల టాయిలెట్ క్లీనర్స్ లిక్విడ్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని హెచ్ఎంలు, డేటాఎంట్రీ ఆపరేటర్ అన్వేష్, సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.